ఈనాటి

PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 89 | ఆదివారం 28 డిసెంబర్, 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

### అప్పుడు ఊగిపోయారు

## ఇప్పుడు సైలెంట్

ఆంధ్రరాష్ట్రానికి అతిపెద్ద ఆస్తి విశాఖ ఉక్కు

**విశాఖ ఉక్కుప్రైవేటు పరం పై నోరు మెదపని పవన్‌కళ్యాన్.. జగ్గారెడ్డి కామెంట్స్..**




**హైదరాబాద్, డిసెంబర్ 27 :** విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ ఉక్కు ఉద్యమం ఒక చరిత్ర. విశాఖ స్టీల్ప్లాంట్పై మోదీ కన్నుపడింది. అందుకే ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారు. ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ (మిగతా 2లో)

### నకిలీ ఏజెంట్ల

## మాటలు వినొద్దు

**వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక**




**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 27 :** మిడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని (మిగతా 2లో)

### అన్నమయ్య జిల్లాకు

## నష్టం జరగదు

**మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**



**అమరావతి, డిసెంబర్ 27 :** జిల్లాల పునర్విభజన పక్రియపై, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. (మిగతా 2లో)



**జిల్లాలు, మండలాలు పునర్విభజనలో**

# మార్పులు..చేర్పులు

- జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయానికి పెద్దపీట..
- నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం..
- నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్..
- మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు..
- సీఎం చంద్రబాబు కీలక సూచనలు ..

**అమరావతి, డిసెంబర్ 27 :** జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేశారు. జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పు చేర్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరోజు సమావేశంలో 927 అభ్యంతరాలు, సూచనలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్, మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 31న తుది నోటిఫికేషన్‌ను ఏపీ సర్కార్ జారీ చేయనుంది. అయితే,జిల్లాల పునర్విభజనపై ప్రాథమిక నోటిఫికేషన్‌ను నవంబరు 27వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నెల రోజుల పాటు అభ్యంతారాలను స్వీకరించింది. అయితే శనివారంతో గడువు ముగుస్తోంది. ప్రాథమిక నోటిఫికేషన్ అనంతరం వ్యక్తమైన అభ్యంతరాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి (మిగతా 2లో)

**ప్రభుత్వ నిర్ణయాలతో రాజధానీ ప్రాంతంలో**

# రైతన్నలు బలి

- రైతుల అంశంపై ముందుకొచ్చిన వైసీపీ..
- మంత్రి కాన్వాయ్‌లోనే మృతి చెందిన రైతు..
- ఇంకా ఎంతమంది రైతులు చనిపోవాలని ప్రశ్నిస్తున్న వైసీపీ..
- రూ 2.77కోట్ల అప్పులతో రాజధానిలో ఏం చేశారు..
- వైసీపీ మంగళగిరి ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి..



**మంగళగిరి, డిసెంబర్ 27 :** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో అమరావతీ ప్రాంతంలో రైతన్నలు బలవుతున్నారని మంగళగిరి వైసీపీ ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి ఆరోపించారు. రాజధానీ ప్రాంతంలో రైతన్నలను పట్టించుకోలేదని వ్యతిరేక ముద్ర వేసుకున్న వైసీపీ తన తీరు మార్చుకుంది. ప్రభుత్వం పైన మాజీ సీఎం జగన్ పోరుబాట ప్రారంభించారు. అమరావతి వేదికగా కొద్ది రోజులుగా ఆసక్తి కర నిర్ణయాలు జరుగుతున్నాయి. తాజాగా అమరావతిలో సమస్యలను ప్రస్తావించిన రైతు రామారావు అస్వస్థతతో మంత్రి సమక్షంలోనే కుప్పకూలారు. ఆస్పత్రికి తీసుకెళ్లే లోగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు రైతుల అంశం పైన వైసీపీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.ఈ పరిణామం ఆసక్తి కరంగా మారుతోంది.అమరావతి పైన తొలి నుంచి వ్యతిరేక ముద్ర వేసుకున్న వైసీపీ లో కీలక మార్పు కనిపిస్తోంది. తాజాగా (మిగతా 2లో)

### తిరుమలలో వైకుంఠ

# ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

- టోకెన్ వున్నవారికి మాత్రమే దర్శనాలు..
- ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు..
- టోకెన్ పొందిన ప్రతి భక్తుడికీ తక్కువ సమయంలో దర్శనం..



**తిరుమల, డిసెంబర్ 27 :** తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేపట్టారు. టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం అంటూ టిటిడి ప్రకటన చేసింది. శ్రీవాణజ టిక్కెట్లను రద్దు చేశారు. జనవరి రెండు వరకు అంటే 30 నుంచి 2 వరకు కేవలం టోకెన్ దర్నాలు మాత్రమే ఉంటాయి. ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్న తెలిసిందే. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ...ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. తిరుమల వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చౌదరి తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ టోకెన్స్ ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఆయన (మిగతా 2లో)

### రాజధాని అమరావతి

# రైతులకు రుణాలు

- రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కీలక హామీ..
- కొత్తగా పెన్షన్లు, హెల్త్‌కార్డుల మంజూరు.
- 30ఏళ్లపాటు లింకు డాక్యుమెంట్లు లేకుండానే రుణాలు..



**అమరావతి, డిసెంబర్ 27 :** రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు కీలక హామీ దక్కింది. రుణాల విషయంలో వెసులు బాటు కలిగింది. అమరావతి ప్రాంతంలో రైతుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అదే విధంగా కొత్తగా పెన్షన్ల మంజూరు.. హెల్త్ కార్డుల పైన స్పష్టత లభించింది. భూ వివాదాలకు సంబంధించి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని రైతులకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ హామీ ఇచ్చింది.రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై త్రీ మెన్ కమిటీ ఈరోజు (శనివారం) సమీక్ష నిర్వహించింది. కేంద్ర మంత్రి పెమ్మసాని కీలక అంశాలను వెల్లడించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు 30 ఏళ్ల పాటు లింకు డాక్యుమెంట్ లేకుండానే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయని వెల్లడించారు. రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చే డాక్యుమెంట్ ఆధారంగానే రుణాలు ఇచ్చేందుకు సమ్మతించాయని (మిగతా 2లో)

### పేద పిల్లలకు

# అండగా ఎన్టీఆర్ ట్రస్టు

- అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ
- గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణా కేంద్రం..
- అనాధ పిల్లలకు పెద్దదిక్కుగా వుండాలనే విద్యా సంస్థలకు శ్రీకారం...
- ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యుకేషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు...



**హైదరాబాద్, డిసెంబర్ 27 :** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈసంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, (మిగతా 2లో)

# విధులకు హాజరు తప్పనిసరి

- సచివాలయ ఉద్యోగుల విషయంలో మరో నిర్ణయం..
- అనధికార డిప్యుటేషన్లు ఇక కుదరదు..
- నిర్దేశించిన సమయంలో యాప్‌లో రోజూ హాజరు..
- పనుల పర్యవేక్షణ పేరుతో బైటకు వెళ్లడం రద్దు..
- పరిశీలనకు తప్పనిసరి అయితే అధికారుల అనుమతి ఉండాలి..





**అమరావతి, డిసెంబర్ 27 :** ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది. సచివాలయాల సంస్కరణలో భాగంగా ఉద్యోగుల విషయం లో మరో నిర్ణయం తీసుకుంది. తాజాగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో సచివాలయాల సిబ్బంది హాజరు.. సమయ పాలన పైన వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా సీఎం చంద్రబాబు అధికారులకు కీలక సూచనలు చేసారు. ఈ మేరకు ఇప్పుడు జిల్లా అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో.. ఇక నుంచి సచివాలయ ఉద్యోగులు ఈ ఆదేశాల మేరకు వ్యవహరించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఏపీ ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగుల పై మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల హాజరుపై దృష్టి సారించింది. అందుకుగాను క్షేత్రస్థాయి నుంచి సిబ్బంది సమాచారాన్ని సేకరించింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇక తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. అధికారులు చెప్పారని అనధికార డిప్యుటేషన్లపై ఇతర కార్యాలయాల్లో పని చేయడం క్షేత్రస్థాయి పరిశీలన, పనుల పర్యవేక్షణ (మిగతా 2లో)

# రైతన్నలు బలి

(మొదటి పేజి (తరువాయి)

తాజాగా మందడంలో అమరావతి రైతు మంత్రి నారాయణ నిర్వహించిన సభకు హాజరై రోడ్ల విస్తరణ సమస్య పైన స్పందించారు. ఆ వెంటనే అస్వస్థతకు గురయ్యారు. మంత్రి కాన్వాయ్ లోనే ఆస్పత్రికి తరలించే సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన పైన ఇప్పుడు వైసీపీ మంగళగరి ఇంఛార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి స్పందించారు. రాజధానిలో ఇలాంటి రైతు రామారావులు ఇంకా ఎంతమంది బలైపోవాలంటూ ఆయన ప్రశ్నించారు. సుమారు 30 వేల మంది రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ భూములు, ఇళ్లు తీసుకుంటామని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో రైతులను బతకనివ్వకూడదనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. భూమిని లాక్కుంటే రైతు ఎంత వేదన చెందుతాడో పాలకులకు అర్థం కావడంలేదని వ్యాఖ్యానించారు.రైతు రామారావు నుంచి భూమి, ఇల్లు మాత్రమే కాకుండా చివరకు ఆయన ప్రాణం కూడా తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2.77 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు రాజధానిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఒక్క రైతు సమస్యనైనా పరిష్కరించారా అని నిలదీశారు. రైతుల కోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం ఏ అభివృద్ధి చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబుకు రైతుల బాధలు అర్థం కావా అని ప్రశ్నించారు. భూసమీకరణ సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. మొదట భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయలేని చంద్రబాబు మళ్లీ భూసేకరణ చేస్తామని ఎలా చెబుతున్నారని విమర్శించారు. రాజధాని పేరుతో రైతుల జీవితాలను పూర్తిగా అగమ్యగోచరం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రాంతానికి వస్తున్నప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని విమర్శించారు. వెంటనే రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించాలని దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నకిలీ ఏజెంట్ల మాటలు వినొద్దు




(మొదటి పేజి (తరువాయి)

కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# అన్నమయ్యజిల్లాకు నష్టం జరగదు

(మొదటి పేజి (తరువాయి)

మీడియాకు ఓ వీడియో విడుదల చేసిన ఆయన.. పునర్విభజన అంశంలో జరుగుతున్న ప్రచారం తుది నిర్ణయాలు కాదని స్పష్టంచేశారు. జిల్లా ముక్కలు కాబోతోందంటూ వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు, అవగాహనలేని ప్రచారం మాత్రమేనని పేర్కొన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను పూర్తిస్థాయిలో పరిగణలోకి తీసుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారని మంత్రి తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగానే కొనసాగుతుందని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.. రాయచోటి ప్రజలు, నాయకులు ప్రభుత్వం పట్ల పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, జిల్లా కేంద్రం విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని ఆయన భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జిల్లాలోని తాజా పరిస్థితిని వివరించి, సమస్యకు పరిష్కారం చూపుతామని.. ప్రజల అభిప్రాయానికే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పరిపాలన మరింత మెరుగుపడేలా మాత్రమే పునర్విభజన మార్పులు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. వదంతులు వ్యాప్తి చేసే అసత్య ప్రచారాలను ప్రజలు అప్రమత్తంగా గమనించాలని ఆయన కోరారు. ప్రభుత్వం తుది నోటిఫికేషన్ ప్రకటించే వరకు అనధికారిక ప్రచారాలను విశ్వసించవద్దని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

# టమోట కిలో రూ 40

## కక్కలపల్లి మార్కెట్‌లో గరిష్ట ధర రూ 40కి పైనే..

## దిగుబడి తగ్గడమే ధరల పెరుగుదలకు కారణం



అనంతపురము, డిసెంబర్ 27 :

జిల్లాలో టమోటా ధరలు ఆశాజనకంగా పలుకుతున్నాయి. వారం రోజులుగా కక్కలపల్లి టమోటా మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.40కిపైగానే పలుకుతున్నాయి. శుక్రవారం గరిష్ఠ ధర రూ.46 పలికింది. దిగుబడులు తగ్గిపోవడమే ధరల పెరుగుదలకు కారణమన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లోనూ టమోటా దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రస్తుతం టమోటాకు ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. కక్కలపల్లి మార్కెట్‌కు రెండు, మూడు వేల బాక్సులకు మించి దిగుబడులు రావట్లేదు. గతంలో ఒక్కో మండీకి పదివేలకుపైగానే టమోటా బాక్సులు వచ్చేవి. శుక్రవారం మార్కెట్‌కు 1,350 టన్నుల కాయలు మాత్రమే వచ్చాయి. కిలో గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.20 పలుకగా.. సరాసరి రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి తెలిపారు. కాగా నష్టాల మూట కట్టుకుంటున్న రైతన్నలకు ఎదో ఒక విధంగా లాభాలు చేకూరడం మంచిదేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. రూ 1కి కూడా ధర పలకని రోజుల్లో రైతన్నలు తీవ్రంగా నష్టపోయిన సందర్భాలు అనేకం. అలాంటి రైతన్నలు ఎవరైనా టమోటా సాగు చేసివుంటే వారు లాభపడి గతంలో వాటిల్లిన నష్టాల నుంచి బైటపడే అవకాశం వుందని కొందరు మార్కెట్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఏదేమైనా టమోటా సాగు చేసిన రైతన్నల్లో లాభపడినవారికంటే అత్యధికంగా నష్టాలు చవిచూసిన రైతులే అధికం. అలాంటి రైతన్నలకు టమోటా ధర పెరగడం కాస్తంత ఉపశమనం..

# అనాధపిల్లలకు అండగా ..



(మొదటి పేజి (తరువాయి)

వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్ట్స్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.

# మహిళల వస్త్రధారణపై మాట్లాడరాదు..నాగబాబు



హైదరాబాద్, డిసెంబర్ 27 :

మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై మెగా బ్రదర్ నాగబాబు తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై నాగబాబు మాట్లాడుతూ సమాజంలో ఇంకా బలంగా కొనసాగుతున్న పురుషాధిక్య ఆలోచనలను తీవ్రంగా ఖండించారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలనే విషయంపై ఎవరికీ సూచనలు చేసే హక్కు లేదని స్పష్టం చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను రాజకీయ నాయకుడిగా గానీ, సినిమా ఇండిస్ట్రీకి చెందిన నటుడిగా గానీ కాకుండా, ఒక సామాన్య పౌరుడిగా ఈ అంశంపై మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఇటీవల మహిళల దుస్తులపై కొందరు చేస్తున్న వ్యాఖ్యలు సమాజంలో ప్రమాదకరమైన ఆలోచనలకు దారి తీస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా

శివాజీ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇవి మోరల్ పోలీసింగ్‌కు దారితీసే మాటలని, ఇలాంటి ఆలోచనలు సమాజానికి హానికరమని అన్నారు. 'ఆడపిల్ల ఎలా ఉండాలి, ఏ దుస్తులు వేసుకోవాలి, ఎలా మాట్లాడాలి అన్నదానిపై ప్రతి ఒక్కరూ తీర్పులు చెప్పడం మానాలి. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. మహిళల స్వేచ్ఛను కట్టడి చేసే హక్కు ఎవరికీ లేదు' అని నాగబాబు వ్యాఖ్యానించారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలో చెప్పే అధికారం పురుషులకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారిని సమర్థించే మహిళలను చూసి తనకు బాధ కలుగుతుందని కూడా చెప్పారు. సమాజం ఏమనుకుంటుందో, భర్త ఏమనుకుంటాడో అన్న భయంతో కొందరు మహిళలు కూడా ఈ మోరల్ పోలీసింగ్‌కు మద్దతు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాషన్ కాలానుగుణంగా మారుతుందన్న నాగబాబు.. మహిళల దుస్తులను బట్టి వారి క్యారెక్టర్‌ను అంచనా వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఒకప్పుడు తానూ ఇలాంటి ఆలోచనలతోనే మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని, కానీ ప్రపంచాన్ని అర్థం చేసుకున్న తర్వాత తన ఆలోచనలను మార్చుకున్నానని చెప్పారు. 'నాకేం హక్కు ఉంది మహిళల గురించి తీర్పులు చెప్పడానికి ?' అని తాను తనను తానే ప్రశ్నించుకున్నానని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు వారి దుస్తుల వల్ల కాదని, అది పూర్తిగా పురుషుల క్రూరత్వం, పశు బుద్ధి వల్లేనని నాగబాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. కొంతమంది పురుషులు మహిళలను విలాస వస్తువుల్లా చూస్తున్నారని, అలాంటి ఆలోచనలు ఉన్నవారికి మహిళ ఏ దుస్తులు వేసుకున్నా తేడా ఉండదని అన్నారు. సమస్య మహిళల దుస్తుల్లో కాదని, మగవారి ఆలోచనల్లో ఉందని స్పష్టం చేశారు.

ప్పటి సమాజం ఇంకా మహిళలను పూర్తిగా రక్షించే స్థాయికి చేరలేదని నాగబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మహిళలు తమ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఆత్మ రక్షణ విద్యలను నేర్చుకోవాలని సూచించారు. అయితే దీన్ని మహిళలపై భారం వేయడంగా చూడకూడదని, ప్రభుత్వాలు సరైన రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నాయనే నిజాన్ని గుర్తించాలన్నారు. మనం ప్రస్తుతం ఏఐ జనరేషన్‌లో ఉన్నామని, అయినా మహిళలపై పాతకాలపు ఆలోచనలతో మాట్లాడే పురుషుల మనస్తత్వాన్ని ఇకనైనా ఖండించాలని నాగబాబు పిలుపునిచ్చారు. ఆడవారిని అవమానించిన ఏ మగవాడు చరిత్రలో బాగుపడిన దాఖలాలు లేవు. ద్రౌపదిని అవమానించిన కౌరవుల గతి మనందరికీ తెలుసు'అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వీడియోలో హైలైట్‌గా నిలిచాయి. ఈ విషయాలపై మాట్లాడితే విమర్శలు వస్తాయని తెలిసినా, మౌనంగా ఉండటం తప్పేనని నాగబాబు చెప్పారు. మహిళల స్వేచ్ఛను హరించే మాటలు మాట్లాడటం నేరమని, అలాంటి ఆలోచనలను సమర్థించడం కూడా అంతే ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళలు ఇకనైనా ప్రశ్నించాలని, మోరల్ పోలీసింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తానికి.. మహిళల వస్త్రధారణపై శివాజీ వ్యాఖ్యలకు ప్రతిగా నాగబాబు చేసిన ఈ ఘాటైన వ్యాఖ్యలు సమాజంలో జరుగుతున్న మోరల్ పోలీసింగ్, లింగ వివక్షపై మరోసారి పెద్ద చర్చను తెరపైకి తెచ్చాయి. మహిళల స్వేచ్ఛ, గౌరవం, భద్రతపై ఆలోచించాల్సిన సమయం వచ్చిందని ఆయన చేసిన పిలుపు ప్రస్తుతం సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వస్తోంది.

## సిఐటియు సభల కోసం

# విశాఖకు ప్రకాశ్ రాజ్ రాక



విశాఖపట్నం, డిసెంబర్ 27 :

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా శనివారం నుంచి విశాఖపట్నంలో నిర్వహించే 'శ్రామిక ఉత్సవ్'లో పాల్గొనేందుకు ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ శనివారం ఉదయం విశాఖపట్నం చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సిఐటియు నేతలు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా అధ్యక్షులు ఎం. జగ్గునాయుడు, శ్రామిక ఉత్సవ్ ఉపాధ్యక్షులు కందారపు మురళి, ఐద్వా జనరల్ సెక్రెటరీ కె.రమాదేవి తదితరులు ఉన్నారు. ఈ మహాసభల సందర్భంగా జరిగే సాంస్కృతిక , సామాజిక చైతన్య కార్యక్రమాల్లో ప్రకాష్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. దేశవ్యాప్త కార్మిక ప్రతినిధులు హాజరవుతున్న ఈ ఉత్సవాల్లో ఆయన రాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మార్పులు చేర్పులు

(మొదటి పేజి (తరువాయి)

చర్చించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజంపేటను కడపలో కలిపి, రాయచోటిని మదనపల్లిలో కలిపే ప్రతిపాదనలపై ప్రభుత్వం కీలక సమాలోచనలు చేసింది. ఇప్పటికే ప్రకటించిన మూడు జిల్లాలతో 29 వరకు జిల్లాల సంఖ్య పెరగాల్సి ఉంది. తాజా ప్రతిపాదనలతో 28 జిల్లాలకే పరిమితం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇప్పటికే ప్రత్యేక జిల్లాగా ప్రకటించిన రాయచోటిని మదనపల్లిలో కలిపే దిశగా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ప్రకటించిన 3జిల్లాలపై అభ్యంతరాలు, ప్రతిపాదనలపై సమీక్షించారు సీఎం. దొనకొండ, కురిచేడును మార్కాపురం జిల్లాలో.. పొదిలిని ఒంగోలు జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రైల్వే కోడూరును తిరుపతిలో కలిపే అంశంపై కసరత్తు చేశారు. రేపు(ఆదివారం) మరోసారి సమావేశమై ఎల్లుండి మంత్రివర్గం ముందుకు ప్రతిపాదనలు తీసుకురానుంది మంత్రివర్గ ఉపసంఘం. కేబినెట్ ఆమోదం తర్వాత ఈనెల 31వ తేదీన తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ సమీక్షకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, నారాయణ హాజరయ్యారు.

# వైకుంఠ ఏర్పాట్లు పూర్తీ

(మొదటి పేజి (తరువాయి)

వెల్లడించారు. టోకెన్ పొందిన ప్రతి భక్తుడికీ రెండు నుంచి మూడు గంటల్లోనే వైకుంఠ ద్వారా దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఎటువంటి టోకెన్స్ లేకపోయినా.. సర్వదర్శనం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కలుగజేస్తామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 8లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకొచ్చారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులు టీటీడీ ఇచ్చిన సూచనలను గమనించి తిరుమల పర్యటనను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.

# రైతులకు రుణాలు

(మొదటి పేజి (తరువాయి)

ప్రకటించారు. కాగా, జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై జెన్యూన్‌గా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని వివరించారు.కాగా..వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ప్లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నా మని చెప్పారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు. భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్ తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు.

# విధులకు హాజరు తప్పనిసరి

(మొదటి పేజి (తరువాయి)

పేరుతో బయటకు వెళ్లడం ఇకపై కుదరదని తేల్చి చెప్పింది. నిర్దేశించిన సమయంలోగా యాప్‌లో రోజూ హాజరు వేయాల్సిందేనని స్పష్టం చేసింది. రీ సర్వేలో పాల్గొంటున్న కొందరు సర్వేయర్లకు తప్ప మిగిలిన వారెవరికీ మినహాయింపు లేదు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం తప్పనిసరి అనుకుంటే అధికారుల అనుమతి తప్పనిసరి చేస్తూ రాష్ట్ర సచివాలయాల శాఖ ఈ మేరకు చర్యలను చేపట్టింది.ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో గ్రామ, వార్డు సచివాలయాల పని తీరు పై జరిగిన చర్చలో సిబ్బంది తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయా ల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న సమాచారంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అనధికార డిప్యుటేష న్లపై ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. వీటిని గుర్తించిన సచివాలయాల శాఖ రద్దు చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన, పనుల పర్యవేక్షణ పేరుతో బయటకు వెళ్లడానికి చెక్ పెట్టింది. నిర్దేశించిన సమయంలోగా యాప్‌లో హాజరును తప్పనిసరి చేసింది. రీసర్వేలో పాల్గొంటున్న సర్వేయర్లు తప్పితే మిగిలిన సిబ్బంది విధిగా సచివాలయాలల్లో పని చేయాల్సిందేనని స్పష్టం చేసింది. సర్వేయర్లలోనూ అందరికీ మినహాయింపు లేదు. జాయింట్ కలెక్టర్ సూచించిన వారికే వెసులుబాటు ఉంది. వీరు కూడా రీసర్వే చేస్తున్న ప్రాంతంలో యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఇందు కోసం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది.

# ఇప్పుడు సైలెంట్




(మొదటి పేజి (తరువాయి)

స్టీల్ప్లాంట్పై ఊగిపోతూ మాట్లాడారు.. ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారు?.టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. విశాఖ ఉక్కుకి ఎంతో చరిత్ర ఉంది. 1966లో స్టీల్ ప్లాంట్ కోసం అమృతరావు నిరాహారదీక్ష చేశారు. పార్లమెంట్ లో విశాఖ స్టీల్పై ఇందిరాగాంధీ ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్రరాష్ట్రానికి అతిపెద్ద ఆస్తిగా మారింది. విశాఖ ఉక్కు ఉద్యమం ఒక చరిత్ర. ఆంధ్రుల ఆస్తి స్టీల్ ప్లాంట్ను ప్రైవేటుకు కట్టబెట్టాలనే కుట్ర మొదలైంది.రాష్ట్ర విభజనతో ఏపీలో కాంగ్రెస్కు నాయకులు లేకుండా పోయారు.. కార్యకర్తలు మిగిలారు. ఏపి ప్రజలు ఆలోచన చేయాలి. పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్ కోసం ఊగిపోతూ మాట్లాడారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం పదవి తీసుకుని మాట్లాడకుండా కూర్చున్నాడు. రాష్ట్ర విభజన తర్వాత రెండు సార్లు చంద్రబాబు సీఎం అయ్యాడు. ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపలేకపోతున్నారు. కుల పిచ్చిలో ఏపీ ప్రజలు నాయకులను ఎన్నుకుంటున్నారు. స్టీల్ ప్లాంట్ను కాపాడుకోవాలనే ఇంగిత జ్ఞానం కూడా బీజేపీ ప్రభుత్వానికి లేదు' అని ఘాటు విమర్శలు చేశారు.



రాష్ట్రస్థాయి రగ్బీ టీమ్‌కు ఎంపికైన బాల, బాలికల జట్లు

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జట్టు ప్రకటన

కార్యదర్శి శంకర్ ..

**ఆత్మకూరు, డిసెంబర్ 27:**
ఈనెల 29 నుంచి కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను బాలురు, బాలికల జట్టును కార్యదర్శి శంకర్ ప్రకటించారు. బాలికల విభాగంలో నందిని, సాయిశ్రీ, అమృత, శ్రావణి, బి.గాయత్రి, సుస్మిత, మహాలక్ష్మి త్రివేణి, గాయత్రి, వైజయంతి, అలేఖ్య, తేజశ్రీ పాల్గొననున్నారు. బాలుర బాలుర విభాగంలో డింపుల్ సాయినాథ్, జీవంత్, రేవంత్, రామ్‌చరణ్, నవనీత్, రిషిధర్, చక్రి, హేమ సాయి, వరుణ్ సందేశ్, సాయి చరణ్, వినోద్ కుమార్, సుభాష్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ సాల్మన్ రాజు, పీడీ లు గట్టు నాగరాజు, సుదర్శన్, మురళి, చంద్ర పాల్గొన్నారు.



పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన ఎంపీడీవో వీర రాజు

## పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులతో సమావేశం

ఎంపీటీవో వీర రాజు..

**యాడికి, డిసెంబర్ 27 :**
యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో పంచాయితీలు అభివృద్ధిపై ఎంపీటీవో వీర రాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీర రాజు పంచాయతీ కార్యదర్శులకు వివరిస్తూ గ్రామాలలో మురికి కాలువలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ఈ నెల 31వ తేదీ ప్రభుత్వం వితంతు వికలాకులు. వ ృద్ధాప తదితర పింఛన్ పంపిణీ చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీలో ఇంటి పన్నులు ఆన్ లైన్ లో త్వరగా ఇంటింటికి వెళ్లి వసూలు చేయాలని సూచించారు. ఇంటింటికి గూగుల్ ఫామ్ సర్వే చేయాలని కార్యదర్శులకు తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర రాజు. పంచాయతీ కార్యదర్శులు అరుణ్ కుమార్. మహేశ్వర్ రెడ్డి. వెంకట్ రాజు. సురేష్. బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలికల వసతిగృహం సందర్శన

ఎమ్మార్పీఎస్ నాయకులు..

**యాడికి, డిసెంబర్ 27 :**
యాడికి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని శనివారం యాడికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బాలు, నాయకులు సందర్శించారు. సమస్యలపై హాస్టల్ వార్డెన్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. గత మూడు నెలలుగా నైట్ వాచ్ మెన్ లేరని, ఒక వంట మనిషి ఒక పనిమనిషి ఉండడంతో బాలికలకు రాత్రి వేళ కాపలాగా పడుకుంటున్నారని వార్డెన్ జ్యోతి ఎమ్మార్పీఎస్ నాయకులకు వివరించారు. నైట్ వాచ్ మెన్ ఉంటే బాలికలకు రక్షణ ఉంటుందన్నారు. అలాగే అదనపు పనిమనిషి ఒకరిని నియమస్తే పని ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవెళ్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు, అధికార ప్రతినిధి చిరంజీవి, డేవిడ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్ వార్డెన్ జ్యోతితో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఆర్పీఎస్ నాయకులు బాలు



ఎస్సీ హాస్టల్ వార్డెన్ జ్యోతితో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఆర్పీఎస్ నాయకులు బాలు తదితరులు

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**యాడికి, డిసెంబర్ 27 :**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్. శ్రీమతి. డాక్టర్. ఎస్. నిర్మలమురళి ఆధ్వర్యంలో ఎయిమ్ ఫర్ సేవా శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో 9 మంది విద్యార్థులకు శనివారం కొత్త దుస్తులు అందించారు. కోవూరునగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులు, శ్రీమతి ధనలక్ష్మి దంపతుల కుమారుడు గోకుల్ పుట్టినరోజు సందర్భంగా తొమ్మిది మంది విద్యార్థులకు నూతన దుస్తులు , ఆశ్రమ విద్యార్థులకు బిస్కెట్లు చాక్లెట్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కోపం ఆవేశం వీటికి దూరంగా ఉంటూ వినయ విధేయతలతో జీవించాలని, విద్యార్థులకు సూచించారు. మనం ఒక్కటే కాకుండా అందరూ బాగుండాలని మనస్తత్వాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. వీలున్న ప్రతి ఒక్కరూ చదువుకుంటున్న విద్యార్థులకు ఏదో ఒక రూపంలో వారి అవసరం నిమిత్తం సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ప్రతి హిందువు దేశభక్తి, దైవభక్తి కలిగి ఉండాలి

### ఘనంగా హిందూ సమ్మేళనం ..
### పూజ్య శ్రీ కమలానంద భారతి స్వామి ..

**తాడిపత్రి డిసెంబర్ 27:**
ప్రతి హిందువు దేశభక్తి, దైవభక్తి కలిగి ఉండాలని పూజ్య శ్రీ కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయంలో శనివారం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి, తాడిపత్రి శాఖ. ఆధ్వర్యంలో రమేష్ నాథ్ రెడ్డి అధ్యక్షతన హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపన జరిగి విజయదశమికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా హిందూ బంధువులందరిని జాగృతం పరిచే ఉద్దేశంతో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజ్య శ్రీ కమలానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ భారతదేశం సనాతన ధర్మానికి, ఆయుర్వేదానికి, వేదాలకి, నదులకు, సకల శాస్త్రాలకు, సకల దేవతలకు, రుషులకు, చారిత్రాత్మక కట్టడాలకు, దేవాలయాలకు నిలయమన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ కమలానంద భారతి స్వామి



సభా వేదికపై ఆశీనులైన
శ్రీ కమలానంద భారతి స్వామి, లక్ష్మణ్ జీ

ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ మాట్లాడుతూ సమాజంలో తీసుకురావాల్సిన మార్పులు, పంచ పరివర్తనలో భాగంగా కుటుంబ వ్యవస్థ, పర్యావరణం, సామాజిక సమరసత, పౌర విధులు, గురించి వివరించారు. సౌమ్యకృష మోహన్ మాట్లాడుతూ భారతీయ స్త్రీ, ఆదర్శ మాతృమూర్తి, పిల్లల్లో దేశభక్తి ,దైవభక్తి నింపాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ గావించారు. హిందువులు భారీగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, కుల పెద్దలతో పాటు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జానకి రామశర్మ, నరసింహులు, సత్య ప్రసాదరెడ్డి, రంగప్ప తదితరులతో పాటు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంఘం సభ్యుల జీవనోపాధి కోసమే ఈనారి సిఆర్పిల ఎంపిక

### ఏపీఎం చంద్రశేఖర్..

**యాడికి. డిసెంబర్ 27 :**
యాడికి వెలుగు కార్యాలయంలో శనివారం ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈనారి సిఆర్పిల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 41 గ్రామైక్య సంఘాలు ఉండగా 25 సంఘాలలోపు 15 గ్రామ సంఘాలు 25 సంఘాలపైన ఉన్న గ్రామ సంఘాలు 26 ఉన్నట్లు ఆయన తెలిపారు. సెర్ప్ అధికారి వాకాటి కరుణ ఆదేశాల మేరకు 25 సంఘాల లోపల ఉన్న గ్రామ సంఘాలకు ఇద్దరు ఈనారి సిఆర్పిలు 25



సంఘం సభ్యుల సిఆర్పి ఎంపికపై సమావేశంలో
మాట్లాడుతున్న ఏపిఎం. చంద్రశేఖర్



హాజరైన సంఘం సభ్యులు

అంతకన్నా ఎక్కువ సంఘాలు ఉన్న గ్రామైస్య సంఘాలకు 10 సంఘాలకు ఒక ఈనారీ ఇద్దరు సిఆర్పిలు పనిచేసే విధంగా ఎంపిక చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన సిఆర్పిలకు ఒక రోజుకి 300 రూపాయలు నెలలో ఐదు రోజులు వారి గ్రామంలో వారి సంఘాల కోసం జీవనోపాదులు గుర్తించి , సంఘం సభ్యులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు . మన డబ్బులు - మన లెక్కలు పది సంఘాలకు ఒకరు పని చేస్తారని ఆయన అవగాహన పరిచారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ .ఎమ్మెస్ అధ్యక్షురాలు నసీమా సీసీలు సుధాకర్ రావు మల్లికార్జున పుల్లయ్య లక్ష్మయ్య పద్మావతి సిబ్బంది ప్రియాంక యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఐ వెంకటరమణ, ఎస్సై నాగమధుకు సన్మానం

**కనేకల్ , డిసెంబర్ 27 :**
సైబర్ క్రైమ్ కేసు ఛేదింపులో అసాధారణ ప్రతిభ కనబరిచి ఏబీసీడీ రాష్ట్ర అవార్డు పొందిన రూరల్ సీఐ వెంకటరమణ,కణేకల్ మండలం సబ్ ఇన్‌స్పెక్టర్ నాగమధును అనకన్ హాల్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందరరేగా సీఐ వెంకటరమణ,ఎస్సై నాగమధును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.చట్టపరమైన విధుల నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న సీఐ వెంకటరమణ,ఎస్సై నాగమధు సేవలు ఆదర్శనీయమని నాయకులు ప్రశంసించారు. రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడం కణేకల్ మండలానికే గర్వకారణమని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు, విజయాలు సాధించాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అనకాన హల్ నెరగన్న గారి వన్నూరు స్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి అంజిబాబు,డీలర్ మారెప్ప,తెలుగు యువత నాయకులు వసంత్ తదితరులు పాల్గొన్నారు.



సీఐ వెంకటరమణ ఎస్సై నాగమధును
సన్మానించిన హానకనహాల్ టీడీపీ నాయకులు





విందుకు హాజరైనా వైకాపా నేతలతో ఫయాజ్ బాషా. వైకాపా నేతలను ఆహ్వానిస్తున్న ఫయాజ్ బాషా

# ఘనంగా ఖ్వాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి వేడుకలు

### మూడు జిల్లాల వైకాపా నేతలకు విందు
### వైకాపా రాష్ట్ర కార్యదర్శి హీరాపురం ఫయాజ్ బాషా ..

**తాడిపత్రి, డిసెంబర్ 27:**
రాజస్థాన్ రాష్ట్రంలోని, అజ్మీర్‌లో వెలసిన ఖ్వాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి, సుల్తాన్-ఎ-హింద్ ఉర్సుని పురస్కరించుకొని ఫయాజ్ బాష ట్రస్ట్ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హీరాపురం ఫయాజ్ బాషా నివాసంలో శనివారం ఖ్వాజా గరీబ్ నవాజ్ చిష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఖ్వాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి పేరున మతగురువులు ఫాతిహాలు గావించారు. అనంతరం భారీ విందును హీరాపురం ఫయాజ్ బాషా ఏర్పాటు చేశారు. ఈ విందుకు కడప, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి వైకాపా నేతలు భారీగా హాజరైనారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ ఖాన్, వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం నగర మేయర్ వసీం, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి మాజీ మునిసిపల్ ఛైర్మన్ పేరం నాగిరెడ్డి, మాజీ వైకాపా సమన్వయకర్త విఆర్ రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రమేష్ రెడ్డి, రూపాయి డాక్టర్ అనిల్ రెడ్డి, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, ఎల్ఎం మోహన్ రెడ్డి తదితరులు విందులో పాల్గొన్నారు. హీరాపురం ఫయాజ్ బాషా ఏర్పాటు చేసిన భారీ విందుకు తాడిపత్రిలోని ముస్లిం మతగురువులు, మైనారిటీ నాయకులు దాదాపు ఒండు వేల మంది హాజరైనారు.





విందుకు హాజరైనా వైకాపా నేతలు.



స్టాంప్ రైటర్లతో సమావేశమైన జేసీ ప్రభాకర్ రెడ్డి

## అర్హులైన స్టాంప్ రైటర్లకు గదులు కేటాయిస్తాం

మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి..

**తాడిపత్రి, డిసెంబర్ 27:**
పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద మునిసిపాలిటీకి చెందు స్థలంలో స్టాంప్ రైటర్లకు గదులు కేటాయిస్తామని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్టాంప్ రైటర్లతో శనివారం సమావేశఎమయ్యారు.గదులు కావలసిన స్టాంప్ రైటర్లకు అందరితో కలిసి వేలం పాటలో కేటాయిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న స్వామిదాస్.

## పాస్టర్లకు గౌరవేతన బకాయిల విడుదలపై హర్షం

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 27 :**
పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు అన్నారు. స్థానిక జీసస్ కంఫ్యాషన్ చర్చిలో విలేకరుల సమావేశంలో ఈటె స్వామిదాసు మాట్లాడుతూ 2024 డిసెంబర్ నుండి 2025 నవంబర్ మధ్య రాష్ట్రవ్యాప్తంగా 8427 పాస్టర్స్ కు రావలసిన గౌరవ వేతనం రూ. 52 కోట్ల 40 లక్షలు నిధులు విడుదల చేసినందులకు సీఎం చంద్రబాబుకు పాస్టర్స్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఏడాదిగా పెండింగ్ లో గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేయగా ఒక్కొక్క పాస్టర్‌కు 60 వేలు వారి అకౌంట్ లో పడ్డాయని ఈటె స్వామిదాసు తెలిపారు.క్రిస్మస్ పండుగ ముందర గౌరవ వేతనం పడినందుకు పాస్టర్స్ రెట్టింపు ఉత్సహం తో క్రిస్మస్ పండుగ చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమములో ఏ ఎఫ్ టి చర్చి పాస్టర్ శ్యాంసుందర్, ఏష్కోల్ ప్రార్థన మందిరం పాస్టర్ భాస్కర్, పాస్టర్ మేషక్ పాల్గొన్నారు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

## వేద మంత్రాలతో ఆదిత్య మూల మంత్ర హెూమం

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 27:**
నగరంలోని రెండవ రోడ్డు శర్మ కాంపౌండలో శ్రీ జ్ఞానపీఠం ఆధర్వంలో సౌమనస్క యాగం, 2వ రోజు, ఆంజనేయ మరియు ఆదిత్య మూల మంత్ర హెూమం నిర్వహించారు. లఘు పూర్ణాహుతి అనంతరం అన్నదానం నిర్వహించారు.



ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

## ముగిసిన ఖ్వాజా గరిబ్ నవాజ్ ఉత్సవాలు

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 26:**
స్థానిక శ్రీనివాస్ నగర్ విశాల్ మార్ట్ దగ్గరలోని " షాహే గౌసే ఆజం ఆసార్ కమిటీ ఆధ్వర్యంలో ఖ్వాజా గరిబ్ నవాజ్ 814 వ ఉత్సవాలు రాత్రి 7 గంటలకు హజరత్ సయ్యదినా బాబా ఫకృద్దీన్ వంశీకులు సాహెబ్ అల్ హుసైన్ వ హుసైన్, షోహర్వర్ధి పెనుకొండ షరీఫ్ తెహరికె పైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షులు హసన్ రజా ఖాద్రి గారిచే ప్రత్యేక ఫాతేహ (చధింపులు), ప్రత్యేక దువా కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గౌసే ఆజం కమిటీ అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ సెక్రెటరీ . నవీద్ ఖాన్ ట్రెజరర్ అబ్దుల్ సమీ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో హాస్య భారతి కార్యక్రమం

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 26:**
వివేకానంద యోగ భవన్, షిర్డీ నగర్, చర్చి స్కూల్ దగ్గర ఆదివారం ఉదయం 10 గంటలకు హాస్య భారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తరిమల అమర్నాథ్ రెడ్డి, ఎం. రాజశేఖర రెడ్డి తెలిపారు. హాస్యం పండించే ప్రియులకు, హాస్యం ఆస్వాదించే వారికి అందరికి హృదయ పూర్వక స్వాగతం పలుకుతున్నామన్నారు.



శ్రీ అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు రామాంజి స్వామి, రాజశేఖర్ స్వామి

## శ్రీ అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు

**అమరాపురం డిసెంబర్ 27.**

అమరాపురంలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామికి అభిషేకం, వివిధ రకాల పూజలు అర్చకులు , గురు స్వాములు రామానుజ స్వామి, రాజశేఖర్ స్వామి, హరి స్వామి, నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పూలతో అలంకరణ చేశారు.. ఈ పూజా కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు.. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో భజనలు, శ్రీ అయ్యప్ప స్వామి భక్తి పాటలు చూడడానికి, వినడానికి అమరాపురం గ్రామ ప్రజలు తరలివచ్చారు.. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు మంగళహారతి,తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం నిర్వహించారు.



భజన చేస్తున్న అయ్యప్ప భక్తులు

## పురుగులు పడి నరకయాతన పడుతున్న అనాథ వృద్ధుడు

*ఆసుపత్రికి తరలింపు ..*

**మదనపల్లి, డిసెంబర్ 27:**

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి జ్యోతి సినిమా థియేటర్ ఎదురుగా, నడవలేని స్థితిలో పురుగులు పట్టి ఉన్న ఓ అనాథ వృద్ధుడిని స్థానికులు శనివారం రాత్రి గుర్తించారు. 108 సాయంతో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంతు అనే (70) ఏళ్ళ వృద్ధుడిని మూడు రోజుల క్రితం అర్ధరాత్రిలో తీసుకొచ్చి, స్థానిక అవెన్యూ రోడ్డులోని, జ్యోతి సినిమా థియేటర్ ఎదుట రోడ్డు పక్కన పడేసి వెళ్లారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధుడు అప్పటికే పురుగులు పట్టి దుర్వాసన వస్తూ ఉన్నాడు. మూడు రోజులుగా రాత్రుల్లో చలికి వణుకుతూ, పగలంతా ఎండకు ఎండుతూ ఉన్న వృద్ధున్ని స్థానికులు గుర్తించారు. వెంటనే 108 సాయంతో స్థానిక జిల్లా అస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు. రోగికి అటెండర్లు లేక పోతే ఈ ఆస్పత్రే ఆ వృద్ధుడికి నరక కుపంగా మారి ఆనాథగానే ప్రాణాలు వదలాల్సి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది...

## చంద్రన్న సంచార చికిత్సలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

**అమరావతి, డిసెంబర్ 27:**

రాష్ట్ర వ్యాప్తంగా చంద్రన్న సంచార చికిత్స (104 వాహనాలు)ల్లో ఖాళీల భర్తీకి నిర్వహణ సంస్థ భవ్య హెల్త్ కేర్ చంద్రన్న సంచార చికిత్సలో పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీ నోటిఫికేషన్ జారీ చేసింది. హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు పదో తరగతి అర్హత ఉన్న వారికి డ్రైవర్లుగా, డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ పై అవగాహన వారికి డేటా ఎంట్రీ అపరేటర్లుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ, తిరుపతిలో దరఖాస్తులు స్వీకరిస్తారు.

## గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

**విజయవాడ, డిసెంబర్ 27:**

చిట్టినగర్ టిఎంహెచ్ హైస్కూల్ రోడ్డు సచివాలయంలో పని చేస్తున్న విశ్వనాథ్ (45) గుండె పోటుతో మృతి చెందారు. ఉదయం విధులకు సిద్ధం అవుతూ కార్డియాక్ అరెస్టుకు గురైన విశ్వనాథ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విశ్వనాథ్ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. పని భారం, విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా మృతి చెందినట్టు సహెూద్యోగులు చెబుతున్నారు.

# సేవాపథంలో హరీష్ బాబు జన్మదిన వేడుకలు

**బత్తలపల్లి, డిసెంబర్ 27:**

రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాలతో ధర్మవరం నియోజవర్గంలో భారతీయ జనతా పార్టీని అగ్రపతాన నిలబెట్టడమే లక్ష్యంగా, మంత్రి నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు చేస్తున్న క ృషి అభినందనీయమని బిజెపి నాయకులు కొనియాడారు. హరీష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం బత్తలపల్లి మండలం మాల్యవంతం కాశీనాయన ఆశ్రమంలో వెంకట చౌదరి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆశ్రమంలోని సాధువులకు, నిరాశ్రయులకు ఉచిత దుప్పట్ల పంపిణీ, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆడంబరాలకు పోకుండా, పేదలకు అండగా నిలవడమే నిజమైన జన్మదిన వేడుకని హరీష్ బాబు నిరూపించారని కార్యకర్తలు హర్షం



కాశినాయన ఆశ్రమంలో హరీష్ బాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న బిజెపి నేతలు



ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హరీష్ బాబు, బిజెపి నేతలు

వ్యక్తం చేశారు. ఈ సందరరేగా నాయకులు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో బిజెపి బలోపేతనానికి హరీష్ బాబు అహర్నిశలు శ్రమిస్తున్న తీరును కొనియాడారు. పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా ముందుండి నడిపిస్తూ, ధర్మవరంలో బిజెపి క్యాడర్ను ఐక్యం చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద ృష్టికి తీసుకు వెళ్తూ ప్రజాదరణ పొందుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆశయాలకు అనుగుణంగా, నియోజవర్గ అభివ ృద్ధిలో హరీష్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర్, బిజెపి నాయకులు కోటి సూర్య ప్రకాష్ బాబు, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, రామక ృష? తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆలయాల్లో వైభవంగా ధనుర్మాస పూజలు

**అమరాపురం, డిసెంబర్ 27:**

అమరాపురంలో శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి అర్చకులు శ్రీనిధి బట్టర్ అభిషేకం, పుష్ప అలంకరణ, మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి అర్చకులు హరీష్ బట్టర్ అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, పూలతో అలంకరణ వచ్చిన భక్తాదులకు మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధనుర్మాసం సందరరేగా ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి ప్రత్యేకంగా ఆర్యవైశ్య మహిళలు భక్తి గీతాలు, పాటలు వినిపించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు.





శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి, శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు శ్రీనిధి బట్టర్





శ్రీ వాసవి మాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు . ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం.

# పారిశ్రామిక వేత్త ఎమ్జికి జన్మదిన శుభాకాంక్షలు

**వైసీపీ నాయకులు..**

**తనకల్లు, డిసెంబర్ 27:**

తనకల్లుకు చెందిన పారిశ్రామికవేత్త ఎంజి రెడ్డి జన్మదిన వేడుకలు దేశాయి సంజీవరెడ్డి మిషన్ లో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. అదేవిధంగా 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్డు పాలు పంచిపెట్టారు. సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. వైద్యులకు మిఠాయి బాక్సులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు దేశాయ్ భక్తవత్సల్ రెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కడపల నరసింహారెడ్డి, హేమశేకర్ రెడ్డి, రామ్ దేశాయ్ భారతి, కరె నరేంద్ర సూరి, విశ్వనాథ్ రెడ్డి , రామకృష్ణ, కమిటీ సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కోస్తున్న దృశ్యం





ఆసుపత్రితో రోగులు, నర్సులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



శ్రీనివాస్ మూర్తి దంపతులను సన్మానించిన ఉపాధి హామీ సిబ్బంది

## టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తి దంపతులకు ఘన సన్మానం

**అగళి, డిసెంబర్ 26 :**

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరిగేపల్లి బి శ్రీనివాస్ మూర్తి దంపతులను శనివారం ఆయన స్వగృహంలో ఏపిఓ మంజునాథ్‌తోపాటు ఉపాధి హామీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి వారికి శాలువాకప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ మండలంలో గ్రామాల వారీగా అందరం కలిసి కట్టుగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం స్థానాల్లో గెలిచేలా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ్ తో పాటు జేఈ ఈరప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు దేవగిరి, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు మంజునాథ్, మధు, బళ్ళిలింగప్ప, శివరాజు, తదితరులు పాల్గొన్నారు,

## రైల్వే సలహా కమిటీ డైరెక్టర్‌గా గొట్టుగురికి లక్ష్మీనారాయణ నియామకం

*వెంకటరెడ్డి, గోవిందరాజు సోదరుల అభినందనలు..*

**రోళ్ల, డిసెంబర్ 27 :**



బెంగుళూరు విభాగం రైల్వే సలహా కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన లక్ష్మీనారాయణను రోళ్ల మండలం గొట్టుగురికి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటరెడ్డి, గోవిందరాజు సోదరులు ఘనంగా సన్మానించారు. మధుగిరి నియోజకవర్గం భారతీయ జనతా పార్టీలో చురుకుగా పనిచేయడంతో కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్న ప్రతిపాదన మేరకు లక్ష్మీ నారాయణకు ఈ పదవి దక్కిందని అతని సోదరులు వెంకటరెడ్డి, గోవిందరాజు తెలిపారు. బెంగుళూరు విభాగపు రైల్వే సలహా కమిటీ డైరెక్టర్‌గా లక్ష్మీనారాయణ నియామకానికి కృషి చేసిన రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్న, బిజెపి నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష్మీ నారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న రైల్వే సహాయ మంత్రి సోమన్న




విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మెమెంటోలు అందించిన మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్

## కౌశల్- 2025 రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన అగళి విద్యార్థిని బి. దీక్షిత

*మండల విద్యాధికారుల అభినందనలు..*

**అగళి, డిసెంబర్ 27 :**

రాష్ట్ర స్థాయిలో జరిగిన క్విజ్ పోటీ కౌశల్ -2025లో అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని బి. దీక్షిత నాలుగవ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన బి దీక్షతకు శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసా పత్రం తో పాటు కౌశల్ రాష్ట్రస్థాయి మెమెంటో అందించారు. అదేవిధంగా విద్యార్థులకు గైడ్ చేసిన షబ్బీర్ కు ప్రశంసాపత్రం అందించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రోత్సహం అందించిన గైడ్ టీచర్ షబ్బీర్, ప్రధానోపాధ్యాయులు పి.మస్తాన్ ఖాన్‌కు ఎంఈఓ-1 కృష్ణమూర్తి రాజు, ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు, అభినందనలు తెలియజేశారు. దీక్షిత రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి మరెన్నో ప్రశంసా పత్రాలను అందుకోవాలని ఆకాంక్షించారు.







# తనకల్లు ఘనంగా హిందూ సమ్మేళనం

**విశిష్ట అతిథిగా పాల్గొన్న భవ్య నంద మాతాజీ..**

**తనకల్లు, డిసెంబర్ 27:**

తనకల్లు మండల కేంద్రంలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి శ్రీశ్రీశ్రీ భవ్యానంద మాతాజీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. హిందూత్వ సనాతన ధర్మం గురించి, స్వాములు, రాజుల గురించి వివరించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ చేసిన కృషి, కీర్తి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హసనాపురం చంటి, మండల అధ్యక్షుడు బాబు రెడ్డి , జానకి.సురేంద్ర,సురేష్ , నరేష్ తనకల్లు మండల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు సురేష్ శెట్టి, నరసింహ మూర్తి,భార్గవ , రాజన్న , జయ చంద్ర గిరిజన మోర్చ కార్యదర్శి లచ్చప్ప, జానకీ, అయ్యప్ప మండలి సభ్యులు రత్నమయ్య శెట్టి, రిషి నందన్,నాగేంద్ర రెడ్డి,నాగిరెడ్డి, రెడ్డి శేఖర్, భజరంగ దళ్ సభ్యులు శ్రీనివాసులు, దామోదర్ , ఆర్ ఎస్ ఎస్ సభ్యులు సుధాకర్, వీర ప్రసాద్, బాలాజీ , ఆంజనేయులు, మైనార్టీ మోర్చా బాబా పక్రుద్దీన్ , ఖాసీం వివిధ గ్రామాల భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకల్లు మండల కేంద్రం నుండి కొక్కంటి క్రాస్ వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ గోపీ పోలీసు సిబ్బందితో ప్రాంగణాన్ని పరిశీలించారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం





తనకల్లులో జరిగిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న శ్రీశ్రీశ్రీ భవ్యానంద మాతాజీ . హాజరైన హిందూ బంధువులు



తాయత్తులు కట్టిన వ్యక్తులను గుర్తించాలని ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

# క్షుద్రపూజలు చేసి తాయత్తులు కట్టిన వ్యక్తులను గుర్తించండి

### ఎస్ఐకి సొసైటీ ఛైర్మన్ ఫిర్యాదు

**పెద్దకడబూరు, డిసెంబర్ 27 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం - 2, సొసైటీ వద్ద ఏక కాలంలో క్షుద్ర పూజలు చేసి తాయత్తులు కట్టిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప శనివారం పెద్దకడబూరు పోలీసు స్టేషన్ లో ఎస్ఐ నిరంజన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ కేంద్రం - 2లో అంగన్వాడీ కార్యకర్తగా తన భార్య, సొసైటీ ఛైర్మన్ గా తాను పని చేస్తున్నానని గుర్తు చేశారు. అయితే ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవు కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు తన కుటుంబానికి కీడు చేయాలనే ఉద్దేశంతో క్షుద్ర పూజలు చేసి తాయత్తులు కొట్టడంతో మా కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ చేసి ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తుల గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# వైకుంఠ ఏకాదశికి శాంతియుత దర్శనాలు

**తిరుపతి, డిసెంబర్ 27:**
వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని, తిరుమల శ్రీవారి దర్శనానికి భారీగా తరలివచ్చే భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ మేనేజ్మెంట్ అంశాలపై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మరియు టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుమల, తిరుపతి నగర పరిధిలో భక్తుల కదలికలు, క్యూలైన్‌ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు, మార్గదర్శక ఏర్పాట్లపై చర్చ జరిగింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా, పోలీస్ మరియు టిటిడి అధికారులు సమన్వయంతో శాంతియుత దర్శనాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులు టికెట్‌లో పేర్కొన్న తేదీ, సమయం ప్రకారం మాత్రమే తిరుమలకు రావాలి. టికెట్ లేకుండా వస్తే వసతి సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. క్యూలైన్‌లలో భక్తులు సహనం, శాంతి, క్రమశిక్షణ పాటించాలిబీ తోపులాట, తొందరపాటు చర్యలు చేయవద్దు. పోలీస్, టిటిడి సిబ్బంది ఇచ్చే సూచనలు భక్తుల భద్రత కోసం మాత్రమే ఉంటాయి. ఇతర భక్తులకు ఇబ్బంది కలిగించరాదు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సహాయం అందించాలన్నారు.

దళారుల గురించి సమాచారం ఉంటే సమీప పోలీస్ లేదా టిటిడి సిబ్బందికి తెలియజేయాలని, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కింగ్ ప్రాంతాల్లో పోలీసులు సూచించిన మార్గదర్శకాలు మాత్రమే అనుసరించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మవద్దని, అధికారిక టిటిడి/పోలీస్ హెల్ప్‌లైన్ నుండి వచ్చే సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. భక్తులు ఇతర భక్తుల పట్ల గౌరవం చూపుతూ, శాంతియుత వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకోవాలన్నారు. సిబ్బంది ఎక్కడా అలసత్వం లేకుండా, విధుల్లో అప్రమత్తంగా ఉండాలి. భక్తుల భద్రత విషయంలో రాజీ పడకూడదన్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి (అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు) వచ్చే భక్తులను బార్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీ చేసి, టోకెన్ లేకుండా వచ్చిన వారికి కలిగే అసౌకర్యాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

క్యూలైన్‌లలో ఎంట్రీ-ఎగ్జిట్ వ్యవస్థలు, భక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి, భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలిబీ అవసరమైన వసతి, సౌకర్యాలు అందించాలన్నారు.

1800 మంది సిబ్బందితో సమగ్ర ఏర్పాట్లు చేసారని, పోలీసులు పూర్తి సహకారం అందుతున్నారని తెలిపారు. 10 కట్%-%ఆఫ్ పాయింట్లలో ప్రత్యేక సిబ్బంది నియమించబడ్డారని, మొత్తం ప్రాంతాన్ని జోన్ల వారీగా విభజించి, ప్రతి జోన్‌కు ఇన్‌చార్జ్‌ని నియమించారని చెప్పారు. భక్తులకు టికెట్, సమయం, తేదీ ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని, అన్ని ప్రాంతాలు (తిరుమలలో, తిరుపతిలో) సీసీటీవీతో పర్యవేక్షణ జరుగుతుందని, అనుచిత ప్రవర్తనలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు, టిటిడి మరియు ఇతర అనుబంధ శాఖలు 24ఐ7 సమన్వయంతో పనిచేస్తూ భక్తుల భద్రతను ప్రధాన లక్ష్యంగా ఉంచి, సోషల్ మీడియా కంటెంట్ పర్యవేక్షణ ద్వారా అపోహ, అసత్య ప్రచారాలపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం, వైకుంఠద్వార దర్శనాలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ - ఇండియన్ నావల్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం

**గుంటూరు , డిసెంబర్ 27:**
గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ మరియు కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లా ఎఝిమలాలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ నావల్ అకాడమీ (ఐఎన్ఏ) మధ్య అకడమిక్ మరియు పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండియన్ నావల్ అకాడమీ ప్రిన్సిపల్ రియర్ అడ్మిరల్ జీ.రాంబాబుకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

ఈ ఎంఓయూ ద్వారా ఇరు సంస్థల మధ్య ఫ్యాకల్టీ మార్పిడి, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములు నిర్వహించనున్నట్లు తెలిపారు. అకడమిక్ సమాచార మార్పిడి, పరిశోధనా పబ్లికేషన్లు, అధ్యయన సామగ్రి పరస్పర మార్పిడి ద్వారా జ్ఞాన విస్తరణకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఇండియన్ నావల్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు విజ్ఞాన్ యూనివర్సిటీలో తరగతులు, షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహించడంతో పాటు, పరిశోధన ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం అందించనున్నారని తెలిపారు. అలాగే విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకులు ఐఎన్ఏలో సెమినార్లు, నాణ్యతాభివృద్ధి కార్యక్రమాలు, శిక్షణ తరగతుల్లో పాల్గొననున్నారు.

ఈ ఒప్పందం ద్వారా ఎంటెక్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా అవకాశాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, పరిశ్రమ-అకడమిక్ అనుసంధానం, ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, లైబ్రరీ వనరుల పరస్పర వినియోగం సాధ్యమవుతుందని తెలిపారు. నావల్ క్యాడెట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆధునిక ప్రయోగశాలలను వినియోగించుకునే అవకాశం పొందనుండగా, విజ్ఞాన్స్ విద్యార్థులు ఐఎన్ఏలో నిర్వహించే టెక్నికల్, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జాతీయ భద్రత, సాంకేతిక అభివృద్ధి, పరిశోధన రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఈ అవగాహన ఒప్పందం బలమైన పునాది వేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్సలర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, ఇండియన్ నావల్ అకాడమీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




# ఉప్పర సగర సంఘం గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దకడబూరు, డిసెంబర్ 27 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో ఉప్పర సగర సంఘం జిల్లా అధ్యక్షులు గోనబావి గోపాల్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా భీమేష్, గ్రామ ప్రధాన కార్యదర్శిగా మోహన్, ట్రెజరర్ గా నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందరరేగా ఉప్పర సగర సంఘం జిల్లా అధ్యక్షులు గోనబావి గోపాల్, మంత్రాలయం తాలూకా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ఉప్పర సగర కులస్థుల అభివ ృద్ధికి, సంక్షేమానికి నూతన కమిటీ క ృషి చేయాలని సూచించారు. ఉప్పర కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని హితవు పలికారు. మంత్రాలయం తాలుకాలో అత్యధికంగా ఉప్పర కులస్థులు ఉన్నారని, వారికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలన్నారు. సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగదలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు మాట్లాడుతూ ఉప్పర కులస్థుల అభివ ృద్ధికి తమ వంతు క ృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సగర సంఘం నాయకులు ఉప్పర ఈరన్న, గుంతకల్ గోవిందు, కల్లుకుంట చిన్న అయ్యన్న, రాగిమాన్ దొడ్డి రమేష్, నరసింహులు, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.




ఉప్పర సగర సంఘం గ్రామ కమిటీకి ఎన్నికైన సభ్యులు





మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గోనబావి గోపాల్. సమావేశానికి హాజరైన ఉప్పర సగర కులస్థులు

# ముఖద్వారం నిర్మాణానికి రూ. 30 వేలు విరాళం

**పెద్దకడబూరు, డిసెంబర్ 27 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామ శివారుల్లో వెలిసిన శ్రీ వ్యాసరాజ ప్రతిష్ఠిత శ్రీ పైరయ్య ఆంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖద్వారం నిర్మాణం కోసం గొర్రెల పెద్దన్నమయ్య కుమారుడు గొర్రెల ఈరన్న రూ. 30 వేలు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామక ృష? స్వామి దాత గొర్రెల ఈరన్న పేరు మీదుగా స్వామివారికి అభిషేకం చేశారు. దాతలకు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ముఖద్వారం నిర్మాణం కోసం రూ. 30 వేలు విరాళం అందజేస్తున్న దృశ్యం




దాతల పేరు మీదుగా అభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు రామకృష్ణస్వామి

# పెద్దకడబూరులో రెవెన్యూ స్పెషల్ క్యాంప్

### రైతుల సమస్యలపై వినతుల స్వీకరణ ..

**పెద్దకడబూరు, డిసెంబర్ 27 :**
పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డుల సమస్యలను పరిష్కరించేందుకే శనివారం రెవిన్యూ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. రెండవ రోజు పెద్దకడబూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని రైతుల సమస్యలపై రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లలిత కుమారి, ఆర్ఐ జెర్మియా రైతుల సమస్యలను తెలుసుకొని వినతులను స్వీకరించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ నిషేదిత జాబితాలో (22ఏ1) ఉండి రిజిస్ట్రేషన్ కాకుండా ఉన్న పట్టా భూములు, వెబ్ ల్యాండ్ అడంగల్ నందు ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్న భూములు, చుక్కల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వినతులను స్వీకరిస్తామన్నారు. రైతుల నుంచి వచ్చిన సమస్యలపై విచారణ చేసి పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ తేజస్విని, వీఆర్వో నరసప్ప, వీరారెడ్డి, గ్రామ సర్వేయర్లు లలిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి వినతులను స్వీకరిస్తున్న రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లలితకుమారి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లలితకుమారి

# శ్రీశైలంలో ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు

**శ్రీశైలం, డిసెంబర్ 27:**
దేవస్థానం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు ప్రారంభించారు. మల్లికార్జునసదన్‌లోని హాల్ నందు ఈ ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారంలో భాగంగా ఈ ఆధ్యాత్మికగ్రంథాలయం ఏర్పాటు చేయబడిందన్నారు. గ్రంథాలయంలో పురాణాలు, ఇతిహాసాలు, భక్తిసాహిత్యం మొదలైన గ్రంథాలను భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం గంగాధర మండపం వద్ద గల తిరుపతి సత్రం పాత భవనాన్ని తొలగించి ఆ ప్రదేశంలో ఆధ్యాత్మిక గ్రంథాలయం, మ్యూజియం, గదులను నిర్మించనున్నట్లు తెలిపారు కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులలో భక్తిభావాలను మరింతగా పెంపొందించి వారిలో ఆధ్యాత్మిక చింతను కలిగించేందుకు ఈ గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. దశలవారిగా గ్రంథాలయాన్ని విస్తరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం వారి నుంచి సుమారు 1000కి పైగా గ్రంథాలను పొంది పాఠకులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా సుమారు 1400లకు పైగా ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు పలువురు ఆధ్యాత్మిక రచయితలు మరియు ఇతర సంస్థల నుంచి ఆధ్యాత్మిక మరిన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను పొందేందుకు చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఈ గ్రంథాలయంలో దినపత్రికలను, పలు ఆధ్యాత్మిక మాసపత్రికలను కూడా అందుబాటులో ఉంచనున్నారు. స్థానికులు, భక్తులు ఈ గ్రంథాలయ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు కోరారు



ధర్మకర్తల మండలి సభ్యులు





ఆధ్యాత్మిక గ్రంథాలను పరిశీలిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

# ఐఎఎస్‌ల ఆస్తుల వెల్లడి తప్పనిసరి

**ఢిల్లీ, డిసెంబర్ 27:**
ఐఎఎస్‌లకు అధికారులకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. నిర్దేశిత గడువులోగా తమ ఆస్తుల వివరాలను వెల్లడించకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేసింది. అవసరమైతే పదోన్నతులను కూడా నిలిపివేస్తామని పేర్కొంది. %ఖూూ% అధికారులు తమ వార్షిక స్థిరాస్తి వివరాలను 2026 జనవరి 31 లోగా తప్పనిసరిగా దాఖలు చేయాలని ఆదేశించింది. గడువు దాటితే ప్రమోషన్లపై ప్రభావం ఉంటుందని తెలిపింది.

# సర్వేయర్ల సమస్యలు పరిష్కరించండి

**మదనపల్లి, డిసెంబర్ 27:**
అన్నమయ్య జిల్లా లోని సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలనికోరుతూ శనివారం మదనపల్లి సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణికి సర్వేయర్ల యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్షులు రెడ్డప్ప, ఉపాధ్యక్షులు చక్రపాణి నాయుడు, సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న ఆరు ప్రధాన సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి పరిష్కరించానిసర్వేయర్లు డిమాండ్ చేశారు.

# శ్రీకాళహస్తిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన చర్యలు

**శ్రీకాళహస్తి , డిసెంబర్ 27:**
తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి డీఎస్పీ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ముఖ్య ఉద్యేసంతో శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా “డ్రంక్ అండ్ డ్రైవ్” వాహన తనిఖీలు నిర్వహించారు. , మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 06 మంది వాహనదారులను గుర్తించి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా జరిమానా విధిస్తూ న్యాయమూర్త ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులలో భాగంగా, ప్రతి ఒక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.60,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని, ఇది చట్టరీత్యా నేరమని, రోడ్డు భద్రత కోసం ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని తెలిపారు.

# నకరికల్లు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు..

**నకరికల్లు, డిసెంబర్ 27:**
నకరికల్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుని సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చొరవ చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా నకరికల్లు స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో అల్లర్లు జరగకుండా నివారించడానికి ప్రతీ గ్రామానికి ఒక్కొక్క పోలీసును కేటాయించామని తెలిపారు.రౌడీ షీటర్లు పద్ధతులు మార్చుకొని నడుచుకోవాలని,లేని యెడల వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీలలో సత్తెనపల్లి రూరల్ సీఐ పీ.కిరణ్, ఎస్సై కే.సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదుగురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వ కార్యదర్శులుగా పదోన్నతి

**అమరావతి, డిసెంబర్ 27:**
2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులను సూపర్ టైమ్ స్కేల్ (పే మ్యాట్రిక్స్ లెవల్%-%14)కు, క్యాడర్‌కు సమానంగా, 2026 జనవరి 1 నుండి అమలులోకి వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ప్రభుత్వ కార్యదర్శులు గా పదోన్నతి పొందిన అధికారులలో చదలవాడ నాగరాణి , డా. నారాయణ భరత్ గుప్తా, అమ్రపాలి కటా, జె. నివాస్, గంధం చంద్రుడు ఉన్నారు. పదోన్నతుల అనంతరం డా. నారాయణ భరత్ గుప్తాను అదే పదవిలో కొనసాగిస్తూ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, ఆర్‌యూఎస్‌ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. అమ్రపాలి కటా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. గంధం చంద్రుడిని కార్మిక శాఖ కమిషనర్‌గా నియమిస్తూ, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.వి. శేషగిరి బాబును రిలీవ్ చేశారు. చదలవాడ నాగరాణి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా అదే పదవిలో కొనసాగనున్నారు. అవసరమైన చోట్ల పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్, క్యాడర్ సమానత్వానికి సంబంధించిన ఉత్తర్వులు వేరుగా జారీ చేస్తామని ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు.

# విజయవాడ దుర్గగుడికి విద్యుత్ సరఫరా నిలిపివేత

**విజయవాడ , డిసెంబర్ 27:**
విజయవాడ దుర్గగుడికి విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.3.08 కోట్లుగా ఉన్నాయంటూ ఏపీసీపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. 2023 ఫిబ్రవరి నుంచి బిల్లులు చెల్లించలేదని విద్యుత్ శాఖ చెబుతుండగా, బకాయిలపై పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో హెచ్‌టీ లైన్ నుంచి విద్యుత్‌ను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యపై దేవస్థానం భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. అయితే భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సేవలకు అంతరాయం లేకుండా జనరేటర్ల సాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. అలాగే తమ సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను వినియోగిస్తున్నామని పేర్కొంటూ, నెట్ మీటరింగ్ కోసం విద్యుత్ శాఖను పలుమార్లు కోరినప్పటికీ సాంకేతిక ఉత్పత్తి అయిన విద్యుత్‌ను నమోదు చేయలేదని పేర్కొంది.

## నేడు పీఎం లంకలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన

**కలెక్టర్ నాగరాణి ..**

**భీమవరం, డిసెంబర్ 27 :**
పశ్చిమ గోదావరి జిల్లా పెదమైనవానిలంక (పీఎం లంక) గ్రామం సమగ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరే కేంద్ర మంత్రి, ఉదయం 11 గంటలకు పీఎం లంకలోని డిజిటల్ బిల్డింగ్‌కు చేరుకుని 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సియెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన



డ్రోన్లు, కృత్రిమ మేధస్సు (%ూ×%) నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, 'వికసిత్ భారత్ –డిజిటల్ ఇండియా' థీమ్‌పై రూపొందించిన చిత్రాలను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా గేమ్ హబ్ / గేమ్ ఫౌండేషన్, ఎగ్జిమ్ బ్యాంక్‌లతో ఎంఓయూల సంతక కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. కేంద్ర మంత్రి పర్యటనలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా జీవనోపాధి చెక్కుల పంపిణీ జరగనుందని చదలవాడ తెలిపారు. అలాగే "వికసిత్ భారత్ %–% డిజిటల్ ఇండియా" అంశంపై విద్యార్థుల చిత్రలేఖన పోటీలు, "వందే మాతరం" అంశంపై గాన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం , అనంతరం డెలాయిట్ ఆధ్వర్యంలో నిర్మించిన గేబియన్ వాల్ నిర్మాణాన్ని కేంద్ర మంత్రి పరిశీలిస్తారు. నరసాపురంలో భోజన విరామం అనంతరం కవితమ్ దేవాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవాడకు తిరిగి వెళ్తారని కలెక్టర్ వివరించారు.

పీఎం లంక గ్రామాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దత్తత తీసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (%జూ=%) కార్యక్రమాలు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేద మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల కోసం పడవలు, వేట జాలాలు, త్రిచక్ర వాహనాలు, ఐస్ బాక్స్‌లతో కూడిన మోపెడ్‌లను అందిస్తూ రూ.50 లక్షల విలువైన సహకారం అందించడం ప్రశంసనీయమని అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జడ్పీ హైస్కూల్ మౌలిక వసతుల అభివృద్ధికి భవన రంగుల పనులు, బెంచీలు, ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం అందించడంతో పాటు డిజిటల్ కమ్యూనిటీ భవన్ అభివృద్ధికి తోడ్పడి రూ.21.86 లక్షల సీఎస్ఆర్ సహాయం అందించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ సంస్థ మత్స్యకార కుటుంబాల ఆర్థిక స్థిరత్వం కోసం పడవలు, వేట జాలాలు, వాహనాలను అందిస్తూ రూ.26.50 లక్షల సహాయం చేయడం గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. అలాగే ఎగ్జిమ్ బ్యాంక్ మహిళా సాధికారత లక్ష్యంగా లేస్ తయారీ, కుట్టు నైపుణ్యాలు, జుకీ మెషిన్ ఆపరేషన్, నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలను రూ.35.77 లక్షల వ్యయంతో నిర్వహించడం మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

పీఎం లంక గ్రామ దీర్ఘకాల భద్రత దృష్ట్యా సముద్ర తీరం కోతను నివారించేందుకు 1,000 మీటర్ల పొడవైన కోత నిరోధక కట్ట (యాంటీ–ఎరోషన్ ఎంబాంక్‌మెంట్) నిర్మాణ ప్రాజెక్టును రూ.13.72 కోట్ల వ్యయంతో అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పర్యవేక్షణకు డెలాయిట్ టచ్ తోహ్మాట్సు ఇండియాను నియమించగా, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ నిరంతర పర్యవేక్షణ చేస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు సుమారు 55 శాతం పూర్తయ్యాయని, కొంత ఆలస్యం జరిగినప్పటికీ 2026 జనవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా వేగంగా సాగుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు.

విభిన్న కార్యక్రమాల అమలు ద్వారా పీఎం లంక గ్రామం స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్య, డిజిటల్ సదుపాయాలతో సమగ్రంగా అభివృద్ధి చెందుతున్న ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోందని నాగరాణి తెలిపారు. ఈ అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రికి, సీఎస్ఆర్ సహకారం అందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, ఎగ్జిమ్ బ్యాంక్ ప్రతినిధులకు, అలాగే నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న అధికారులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేలా సమిష్టి కృషితో ముందుకు సాగుదామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు.

## బాలల రక్షణ అందరి బాధ్యత

**మండల స్థాయి శిక్షణ..**
**డాక్టర్ సురేష్ బాబు..**

**దువ్వూరు, డిసెంబర్ 27 :**
బాలబాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడం, బాధితులకు తక్షణ న్యాయం, వైద్యం అందించడమే లక్ష్యంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శనివారం మండల స్థాయి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్య–ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ, విద్యా మరియు పోలీస్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ బాలల లైంగిక దాడి కేసుల్లో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పోక్సో చట్టం కింద వైద్యులు అనుసరించాల్సిన ప్రోటోకాల్స్, ఫోరెన్సిక్ పరీక్షల ప్రాముఖ్యత మరియు మెడికో–లీగల్ రిపోర్టులను పక్కాగా రూపొందించడంపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. వన్–స్టాప్ సెంటర్ల ద్వారా బాధితులకు లభించే సేవలను వివరించారు.
సైకాలజిస్ట్ డాక్టర్ కె. శిల్పా, సోషల్ వర్కర్ పి. భాస్కర్ మాట్లాడుతూ.. లైంగిక దాడికి గురైన పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గుర్తించడం ద్వారా వారికి త్వరగా సహాయం అందించవచ్చని తెలిపారు. బాధిత కుటుంబాలకు మానసిక మద్దతు ఇవ్వాలని, కేసుల విషయంలో గోప్యత



పీహెచ్సీలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

పాటిస్తూనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు మరియు పోలీస్ శాఖ కలిసి ఒక 'రక్షణ కవచం'లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం. మల్లేశ్వరి, అప్తాలామిక్ ఆఫీసర్ చంద్రమౌళి, సూపర్‌వైజర్లు రాజగోపాల్, విజయకుమారి, శాంతకుమారి, శివగంగరాజు పాల్గొన్నారు. వీరితో పాటు సి.హెచ్.ఓలు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకాలు, పూజలు

**ఆలయ ధర్మకర్త జెసిబి సుబ్బారెడ్డి ..**

**అట్లూరు, డిసెంబర్ 27:**
అట్లూరు మండల పరిధి బద్వేల్– కడప ప్రధాన రహదారి మెయిన్ రోడ్ కుంభగిరి గ్రామం ఆర్చి వద్ద నూతనంగా నిర్మించిన ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి శనివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తామని కావున స్వామివారి భక్తులందరూ పాల్గొని తమ మొక్కులు తీర్చుకోవచ్చని ఆలయ ధర్మకర్త జెసిబి సుబ్బారెడ్డి తెలిపారు. 2025 సంవత్సరం చివరి శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అభిషేకాల మహోత్సవాలను జరుపుకున్నారు. శనివారం లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకాలు, పూజలు చేయడం చాలా



శ్రేష'ం అని ముఖ్యంగా శనిగ్రహ దోష నివారణకు, సంపద, రక్షణ, ఆటంకాలు తొలగిపోవడానికి చేస్తారన్నారు. ముందుగా పాలతో మొదలుపెట్టి పంచామ ృతం, గంధం, నీళ్లతో అభిషేకం చేసి, "ఓం నమో భగవతే నరసింహాయ" మంత్రాన్ని జపిస్తూ, పువ్వులు, ధూపం, దీపాలతో పూజ చేసి, పానకం, పెసరపప్పుతో నైవేద్యం సమర్పిస్తామన్నారు. కావున శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.


ఎంపీపీ పుష్పలతను సన్మానించిన ఉపాధ్యాయులు

## పాఠశాలలో సమస్యలు తెలపండి

**ఎంపీపీ పుష్పలత..**

**ముద్దనూరు, డిసెంబర్ 27 :**
పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఏ సమస్యలు ఉన్న తమకు తెలిపితే పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎంపీపీ పుష్పలత పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో మెయిన్ స్కూల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఇందులో భాగంగా హాజరు పట్టిలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆమెను సంబంధిత ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండకూడదని సంబంధిత ఉపాధ్యాయులతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇంద్రాణి ఉప్పలూరు ఎంపీటీసీ, ప్రధానోపాధ్యాయుడు అనంత వెంకటరమణ, సంబంధిత ఉపాధ్యాయ బ ృందం సాంబ శివా రెడ్డి, రామాకేశవ, భాస్కర్ రెడ్డి, సోమేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## రేషన్ పంపిణీలో పారదర్శకంగా ఉండాలి

**నిబంధనలు అతిక్రమిస్తే**
**డీలర్లపై కఠిన చర్యలు..**
**తహసిల్దార్ సంజీవరెడ్డి,**
**డిటి వేణుగోపాల్..**

**దువ్వూరు, డిసెంబర్ 27:**
మండలంలోని చౌక ధరల దుకాణ డీలర్లు ప్రతి ఒక్కరూ కార్డుదారులకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసిల్దార్ సంజీవరెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్ ఆదేశించారు. శనివారం దువ్వూరులోని తహసిల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ?ఈ సందఠరేగా వారు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆదేశాల మేరకు ప్రతి నెలా డీలర్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేస్తున్న సరుకులను లబ్ధిదారులకు చేరవేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి


రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న డిటి వేణుగోపాల్

వారు పద్ధతి మార్చుకోవాలని వారు హెచ్చరించారు. కార్డుదారుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే సంబంధిత దుకాణాలను తనిఖీ చేస్తామని, అక్రమాలు రుజువైతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సుల రద్దుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల సమయాల్లో బస్సు నడపాలి

**మండల సర్వసభ్య సమావేశంలో**
**ప్రజాప్రతినిధులు..**

**ముద్దనూరు, డిసెంబర్ 27 :**
విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల సమయాల్లో బస్సు నడపాలని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక మండల అభివ ృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపీపీ పుష్పలత అధ్యక్షతన, ఎంపీడీవో రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థుల అవస్థలను ఎంపీడీవో రాధాక ృష? వేణి, ఆర్టీసీ అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిధులు



మండల సర్వసభ్య సమావేశం నిర్వహించిన దృశ్యం


మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

విలేకరులు,సంయుక్తంగా తీసుకెళ్లారు. అనంతరం మీద ప్రభుత్వ శాఖ అధికారులు గ్రామాలలో చేపట్టిన, చేసిన పనులను అభివ ృద్ధి కార్యక్రమాలు సమావేశంలో తెలిపారు. సీఐ నాగేష్ బాబు మాట్లాడుతూ వాహన చోదకులు ప్రయాణ సమయంలో సెల్ ఫోన్ వినియోగించకూడదని అలాగే సీటు బెల్టు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణ సమయంలో సెల్ ఫోను వాడకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఏపీవో గంగయ్య, పంచాయతీరాజ్ ఏఈ ముని, ఏవో వెంకటకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా షేక్ రసూల్ ఎన్నిక

**బద్వేల్, డిసెంబర్ 27:**



వీఆర్ఏల వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నాగులవరం గ్రామ రెవెన్యూ సహాయకులు షేక్. రసూల్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాధాన్యత కలిగిన రెవెన్యూ శాఖలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వీఆర్ఏలు పని చేస్తున్నారన్నారు. వీరందరిని సంఘటితం చేసి చైతన్యపరుస్తూ వారి హక్కులకై అసోసియేషన్ పోరాటాలు నిర్వహించాల్సి ఉందని అన్నారు. అందుకు అనుగుణంగా సంఘంను విస్తృత పరుచుకొని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారం దిశగా పనిచేసి వీఆర్ఏలు మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అభివృద్ధి. సంక్షేమంను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ జీ.వో.లు సక్రమంగా ఉపయోగించుకుని వీఆర్ఏలు లబ్ధి పొందాలన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేందుకు రాష్ట్రంలో ఉన్న వీఆర్ఏలు అందరూ ఐక్య పోరాటాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు.



భూమి రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న నేతలు

## భూమి రీ సర్వే పై అవగాహన

**రామకుప్పం, డిసెంబర్ 27:**
మండలంలో భూమి రీ సర్వేపై ప్రజలకు అవగాహన ఉండాలని తహసిల్దార్ కౌలేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. శనివారం పంద్యాల మడుగు గ్రామపంచాయతీలో భూమి రి సర్వే పై చేపట్టారు. గత ప్రభుత్వంలో భూహక్కుదారులకు పేర్లు మార్పులు, సర్వే నెంబర్లు, భూమి విస్తీర?ం తదితర వాటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క ృష? నాయక్, విశ్వనాథ్, చంద్రమోహన్ రెడ్డి, అప్పల, శివరాం, రైతులు పాల్గొన్నారు.

## టిడిపి బలోపేతానికి కృషి

**ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్..**

**రామకుప్పం, డిసెంబర్ 27:**
మండలంలో టిడిపి బలోపేతానికి నేతలు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం టిడిపి పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందఠరేగా కూటమి ప్రభుత్వంలో చేపడుతున్న అభివ ృద్ధి ,సంక్షేమాలను ప్రజల్లో తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు ఇప్పటినుంచే సంసిద్ధం కావాలన్నారు. గ్రామాల్లో నేతలు కార్యకర్తలు పర్యటించి ప్రజా సమస్యలను అధికారుల ద


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


వైసిపి నుంచి టీడీపీలో చేరిన నేతలు

ృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో నిధులు అభివ ృద్ధి పనులు పరుగులు పెడుతుందన్నారు. అనంతరం మండలంలోని వైసిపి కార్యకర్తలు 25 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ టిడిపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివ ృద్ధి సంక్షేమాలను చూసి ఆకర్షితులై పార్టీలో చేరామని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి నారాయణ చారి, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, సీతాపతి, రామ్మూర్తి,చిన్నక ృష?, శ్రీనివాసులు రెడ్డి, గంట్లప్ప గౌడు, చలపతి, గుర్రప్ప, క ృష? నాయక్, వెంకట్రామ గౌడు, విశ్వనాథ్, మహమ్మద్ రఫీ, జయశంకర్, ఆదిల్, నియజ్, అవినాష్ రెడ్డి, శంకరాచలం, బాలురాజు, సుబ్రి, క ృషా?రెడ్డి, మంజునాథ్, సురేష్, అలివేలమ్మ, పద్మమ్మ, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

## రైతులకు యూరియా పంపిణీ

**రామకుప్పం, డిసెంబర్ 27:**
రైతులకు యూరియా కొరత లేకుండా కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తుందని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు క ృష? నాయక్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పిఎంకె తండాలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ప్రభుత్వం ముందు చూపుతో యూరియా రైతులకు కావలసిన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల పాల్గొన్నారు.

## నేరాల నివారణపై సమగ్ర సమీక్ష

**రాష్ట్ర క్రైమ్ రివ్యూ సమావేశం**

**తాడేపల్లి, డిసెంబర్ 27:**
తాడేపల్లిలో రాష్ట్ర స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఏడాదిలో నమోదైన నేరాలు, వాటిపై విధించిన శిక్షలు, కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణ, కేసుల త్వరిత పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సైబర్ క్రైమ్, క్రిప్టో కరెన్సీ దుర్వినియోగం, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన నివారణ చర్యలపై మంత్రి అనిత అధికారులతో చర్చించారు. సమావేశంలో భాగంగా నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది అధికారులను సన్మానించారు. వారి సేవలను ప్రశంసిస్తూ, ఇతరులకు ప్రేరణగా నిలవాలని సూచించారు. నూతన సంవత్సరంలో కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి అనిత ఆదేశించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు,




నిపుణులైన ప్రొఫెసర్లు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు. సిఐడి డిజి డాక్టర్ రవిశంకర్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, పదిమంది సిఐడి ఎస్పీలు పాల్గొన్నారు.

# సహానా సహానా సాంగ్



ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు.రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.


# సల్మాన్ బర్త్‌డే ..చిరు స్పెషల్ విషెస్



బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ శనివారం 60వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా అతడికి సినీ, క్రీడా. రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక సల్మాన్ బర్త్‌డేను పురస్కరించుకుని టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సల్మాన్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. నా ప్రియమైన సోదరుడు సల్మాన్ ఖాన్‌కు 60వ పుట్టినరోజు శుభాకాంక్షలు. సల్లూ భాయ్, ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్న నీకు నా
హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ఏడాది నీకు అపారమైన ఆనందాన్ని, ఆయురారోగ్యాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.నిన్ను స్నేహితుడని పిలవడం మా లాంటి వారికి దక్కిన అదృష్టం. నీవు మరెన్నో విజయాలు అందుకోవాలి. ఈ రోజంతా సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను అంటూ చిరంజీవి రాసుకొచ్చాడు. గతంలో చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' సినిమాలో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో మెరిసిన విషయం తెలిసిందే.

# సల్మాన్ ఖాన్ 60వ పుట్టిన రోజు

బాలీవుడ్ 'భాయ్ జాన్' సల్మాన్ ఖాన్ శనివారం తన 60వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నాడు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ముంబై సమీపంలోని పన్వేల్ ఫామ్‌హౌస్‌లో డిసెంబర్ 26 రాత్రి నుంచే భారీ స్థాయిలో బర్త్‌డే సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు హాజరై సందడి చేశారు. సల్మాన్ బర్త్‌డే పార్టీలో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన భార్య సాక్షి ధోనితో కలిసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరూ ఫామ్‌హౌస్‌కు చేరుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుకకి రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ జంటగా హాజరై ఆకట్టుకున్నారు. జెనీలియా దేశ్‌ముఖ్ తన పిల్లలతో కలిసి వచ్చి ఫ్యామిలీ టచ్ ఇచ్చింది. హుమా ఖురేషి గ్లామరస్ లుక్‌లో మెరిసింది. సింగర్ మికా సింగ్ స్కూటీపై ఎంట్రీ ఇచ్చి అభిమానులను ఆశ్చర్యపరిచాడు. సల్మాన్ ఖాన్‌కు అత్యంత సన్నిహితుడైన మనీష్ పాల్‌తో పాటు, ఆయన మాజీ ప్రేయసి సంగీతా బిజ్లానీ కూడా పార్టీలో కనిపించడం విశేషంగా మారింది. నటుడు రణదీప్ హుడా తన నిండు గర్భిణి భార్య లిన్‌తో కలిసి హాజరయ్యాడు. సీనియర్ నటి టబు, నిర్మాత రమేష్ తౌరానీ, నిఖిల్ ద్వివేది, మహేష్ మంజ్రేకర్ తదితరులు కూడా పార్టీలో పాల్గొన్నారు. ఖాన్ కుటుంబ సభ్యులు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సల్మాన్ సోదరులు అర్బాజ్ ఖాన్ (భార్య షురా, కూతురితో), సోహైల్ ఖాన్ పార్టీలో సందడి చేశారు. మేనల్లుళ్లు అహాన్, నిర్వాణ్ స్టైలిష్ లుక్స్‌లో ఎంట్రీ ఇచ్చారు. సల్మాన్ సోదరీమణులు కూడా తమ కుటుంబాలతో హాజరయ్యారు. ఈ వేడుకలో సల్మాన్ ఖాన్ కోసం ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. ఆయనతో కలిసి పనిచేసిన దర్శకులు ఈ వీడియో ద్వారా భాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పుట్టినరోజు కానుకగా అభిమానులకు ఓ శుభవార్తను ప్రకటించనున్నట్లు సమాచారం. సల్మాన్ నటిస్తున్న భారీ చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' నుంచి ఒక కీలక అప్‌డేట్ విడుదల కానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. 60వ పడిలోకి అడుగుపెట్టిన సల్మాన్ ఖాన్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతుండగా, పన్వేల్ ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ గ్రాండ్ పార్టీ బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



# సంక్రాంతికి సందడి చేయనున్న చిరు



'ఆర్ యూ రెడీ' అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే.. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి - నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు - వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

# కూలీపై విమర్శలు స్వాగతించిన లోకేష్ కనగరాజ్

తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని వాటిని సరిదిద్దుకుంటానని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా గురించి లోకేశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించి ప్రస్తావించారు. కూలీ' సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను' అని తెలిపారు. రజనీకాంత్, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రజనీ తన మార్క్‌తో అలరించారు. 'వార్ 2'తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.